## గుకేశ్‌కు తొలి గెలుపు

**ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్**



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో గుకేశ్‌కు తొలి విజయం దక్కింది. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో బుధవారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో తెల్ల పావులతో ఆడిన గుకేశ్.. 37వ ఎత్తులో ఆటను ముగించి ప్రత్యర్థిపై పైచేయి సాధించాడు. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో ఓడిన గుకేశ్.. రెండో గేమ్‌ను డ్రా చేసుకున్న విషయం తెలిసిందే. 13వ ఎత్తు తర్వాత ఆటలో ఆధిక్యం సాధించిన గుకేశ్.. ఆ తర్వాత అదే దూకుడును కొనసాగించి లిరెన్‌పై ఒత్తిడి పెంచాడు. ఈ విజయం తర్వాత ఇరువురు ఆటగాళ్లు తలా 1.5 పాయింట్లతో సమంగా నిలిచారు.

## బుమ్రా @1

**బ్యాటింగ్‌లో జైస్వాల్‌కు రెండో స్థానం**



దుబాయ్: పెర్త్ టెస్టులో భారత్‌కు చిరస్మరణీయ విజయం దక్కడంలో కీలకపాత్ర పోషించిన టీమ్‌ఇండియా తాత్కాలిక సారథి జస్‌ప్రీత్ బుమ్రా, యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఐసీసీ టెస్టు ర్యాంకులలో దుమ్మురేపారు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్టు బౌలర్ల జాబితాలో బుమ్రా.. 2 ర్యాంక్‌లు మెరుగుపరుచుకుని మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. పెర్త్ టెస్టులో బుమ్రా (8/72) అద్భుతంగా రాణించాడు. ఈ క్రమంలో బుమ్రా కెరీర్ బెస్ట్ రేటింగ్ పాయింట్లు (883) సాధించడం విశేషం. రబాడా, హాజిల్‌వుడ్, అశ్విన్ తదుపరి స్థానాల్లో నిలిచారు. బ్యాటర్ల విషయానికొస్తే పెర్త్ టెస్టుకు ముందు 4వ స్థానంలో ఉన్న జైస్వాల్.. ఆ మ్యాచ్‌లో సెంచరీ (161) చేయడంతో రెండు ర్యాంక్‌లు పైకి ఎగబాకాడు. రూట్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా విలియమ్సన్, బ్రూక్, మిచెల్ వరుసగా 3,4,5 ర్యాంక్‌ల్లో ఉన్నారు. రిషభ్ పంత్ 6వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా తొలి టెస్టులో శతకం బాదిన విరాట్ కోహ్లీ 9 ర్యాంక్‌లు మెరుగుపరుచుకుని 13వ ర్యాంక్‌కు చేరాడు.

## గౌతమ్‌కు స్వర్ణం

- ప్రపంచ పారా తైక్వాండో టోర్నీ



హనుమకొండ చౌరస్తా, నవంబర్ 27: బహ్రెయిన్ వేదికగా ఈనెల 24 నుంచి 27 వరకు జరిగిన తొలి ప్రపంచ పారా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్ పసిడి పతకంతో మెరిశాడు. ప్రపంచవ్యాప్తంగా 48 దేశాల నుంచి 260 మంది పోటీపడగా, భారత్ నుంచి గౌతమ్‌యాదవ్ బరిలోకి దిగాడు. పురుషుల సీనియర్ పీ-51 విభాగంలో పోటీపడ్డ గౌతమ్..ప్రత్యర్థులపై అద్భుత విజయాలతో పసిడి పతకాన్ని ఒడిసిపట్టుకున్నాడు.

## బీజేపీలో చేరితే నిషేధం ఖతం

- బజ్‌రంగ్ పునియా



ఢిల్లీ: డోప్ పరీక్షలకు నమూనాలు ఇవ్వలేదనే కారణంతో నాలుగేండ్ల నిషేధానికి గురైన రెజ్లర్ బజ్‌రంగ్ పునియా ఈ వివాదంపై స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఒకవేళ తాను గనక బీజేపీలో చేరితే తనపై ఉన్న నిషేధాలన్నింటినీ ఎత్తివేస్తారని పునియా అన్నాడు. బజ్‌రంగ్ మాట్లాడుతూ.. 'నాడా నిషేధం నన్నేమీ ఆశ్చర్యానికి గురి చేయలేదు.దీనిపై నేను గతంలోనే వెల్లడించాను. నాడా అధికారులు శాంపిల్స్ కోసం వచ్చినప్పుడు గడువు ముగిసిన కిట్లతో వచ్చారు.దీనిపై సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. ఒకవేళ నేను బీజేపీలో చేరితే ఈ నిషేధాలన్నింటినీ ఎత్తేస్తారు' అని తెలిపాడు.

## టీపీజీఎల్ ఫైనల్లో ఈగల్స్, వారియర్స్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్(టీపీజీఎల్)లో ఫైనల్ బెర్తులు ఖరారయ్యాయి. లీగ్‌లో గోల్డెన్ ఈగల్స్, వ్యాలీ వారియర్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. బుధవారం జరిగిన వేర్వేరు సెమీస్‌లో గోల్డెన్ ఈగల్స్ 3.5-2.5తో టీమ్ టీఆఫ్ ఫెయిర్‌మౌంట్‌పై విజయం సాధించింది. మరో సెమీస్‌లో వ్యాలీ వారియర్స్ 4-2తో రిట్జ్ మాస్టర్స్‌పై గెలిచింది.

# చెస్ చిచ్చరపిడుగు

## అదరగొడుతున్న ప్రపంచ చాంప్ దివిత్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

**చెస్‌లో మరో చిచ్చరపిడుగు దూసుకొచ్చింది. ఇప్పటికే ప్రపంచ చెస్‌కు దిక్సూచిలా మారిన భారత్ నుంచి మరో చాంపియన్ పుట్టుకొచ్చాడు. పిట్ట కొంచెం కూత ఘనమన్న రీతిలో ఎనిమిదేండ్ల ప్రాయంలోనే ప్రపంచ క్యాడెట్ చాంపియన్‌గా నిలిచి అందరినీ నివ్వెరపరిచాడు. పజిల్స్‌తో మొదలైన అతని ప్రస్థానం ఎత్తులకు పైఎత్తులు వేసే చెస్‌లో ప్రపంచ స్థాయికి చేరింది. పిన్న వయసులోనే చదరంగంలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఆ చిన్నోడు మరెవరో కాదు మన హైదరాబాద్‌కు చెందిన దివిత్‌రెడ్డి. కొడుకు ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు మెరుగైన శిక్షణతో దివిత్‌ను రాటుదేలేలా చేసిన వైనంపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.**

మరో తెలంగాణ తార..ప్రపంచ క్రీడా యవనికపై తళుక్కున మెరిసింది. ఇటలీలో తాజాగా ముగిసిన అండర్-8 ప్రపంచ క్యాడెట్ చెస్ చాంపియన్‌షిప్‌లో దివిత్‌రెడ్డి మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించాడు. ఆఖరి రౌండ్ వరకు ఆసక్తికరంగా సాగిన మెగా టోర్నీలో ప్రత్యర్థుల నుంచి దీటైన పోటీ ఎదురైనా వెరవకుండా రౌండ్ రౌండ్‌కు తన ఆధిక్యాన్ని పెంచుకుంటూ ఏకంగా ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలిచాడు. ఎనిమిదేండ్ల ప్రాయంలోనే చెస్‌లో అసమాన విజయాలు సాధిస్తున్న దివిత్‌రెడ్డి ప్రస్థానం ఆసక్తికరం. ప్రస్తుతం ఫిడే రేటింగ్‌లో 1784 పాయింట్లతో కొనసాగుతున్న దివిత్.. ప్రపంచంలోనే పిన్న వయసు గ్రాండ్‌మాస్టర్ రికార్డును సొంతం చేసుకోవాలన్న పట్టుదలతో దూసుకెళుతున్నాడు. అమెరికాకు చెందిన అభిమన్యు మిశ్రా(12ఏండ్ల 4 నెలల, 25రోజులు) అతి పిన్న వయసు జీఎంగా కొనసాగుతున్నాడు. దీన్ని ఎలాగైనా దాటేయాలన్న ఆకాంక్షతో దివిత్ ఉన్నాడని అతని తండ్రి మహేశ్‌రెడ్డి చెప్పుకొచ్చారు.

### గుకేశ్‌కే చెక్ పెట్టినోడు:

దివిత్ మామూలు చెస్ ప్లేయర్ కాదు. చదరంగం కోసమే పుట్టాడా అన్న రీతిలో ఊహ తెలియని వయసు నుంచే చెస్‌లో ఊహించని ఎత్తులతో ప్రత్యర్థులను చిత్తుచేయడంలో ఆరితేరాడు. హైదరాబాద్‌లో రెండేండ్ల క్రితం జరిగిన ఒక టోర్నీలో పెద్ద కండ్లు జోడు పెట్టుకున్న ఒక బుడతడు.. భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌ను ఓడించి అందిరినీ ఆశ్చర్యపరిచాడు. ఆరేండ్ల ప్రాయంలో దివిత్ చూపించిన టెక్నిక్‌కు ఫిదా అయిపోయిన గుకేశ్ మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. అదే టోర్నీలో తెలంగాణ యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్‌తోనూ దివిత్ పోటీపడ్డాడు. రెండేండ్లు తిరిగి చూస్తే అండర్-8 ప్రపంచ క్యాడెట్ టోర్నీలో దివిత్ విజేతగా నిలిస్తే..గుకేశ్ ప్రస్తుతం డింగ్ లిరెన్‌తో ప్రపంచ టైటిల్ కోసం పోటీపడుతున్నాడు.

### పజిల్స్‌తో మొదలై:

దివిత్ చెస్ కెరీర్ చిన్నతనంలోనే మొదలైంది. తొలుత పజిల్స్ పట్ల దివిత్ ఆసక్తిని గమనించిన అతని తల్లిదండ్రులు ఒక పజిల్ ఇనిస్టిట్యూట్‌లో చేర్పించారు. కానీ అది పెద్దగా ప్రయోజనం కల్గించలేదు. దీంతో ఆరేండ్ల ప్రాయంలో చెస్‌లో అడుగుపెట్టిన దివిత్..అండర్-8 జాతీయ టోర్నీలో తొలిసారి పోటీపడ్డాడు. అక్కడి నుంచి రామకృష్ణ దగ్గర ఓనమాలు నేర్చుకున్న దివిత్..ఇంతింతై వటుడింతై అన్నట్లు ఎదిగాడు. విశాఖకు చెందిన రామకృష్ణతో ఆన్‌లైన్ ద్వారా దివిత్ చెస్‌లో చాలా వరకు మెళకువలు నేర్చుకున్నాడు. అప్పట్లో కొవిడ్-19 కారణంగా ఆన్‌లైన్ క్లాస్‌లు బాగా ఉపయోగపడగా, తన భార్య దివిత్ కెరీర్ తీర్చిదిద్దేందుకు బాగా కష్టపడ్డట్లు తండ్రి మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకానొక సమయంలో స్కూల్ కంటే ఎక్కువగా చెస్ ప్రాక్టీస్‌లోనే గడుపుతుండే వాడని తెలిపాడు. అలా ఒక్కో మెట్టు ఎక్కుతూ ఈస్థాయికి చేరిన దివిత్..చెస్ దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ తరహాలో అటాకింగ్ గేమ్‌ను ఇష్టపడుతాడని చెప్పుకొచ్చాడు. పిన్న వయసులో గ్రాండ్‌మాస్టర్ హోదా పొందేందుకు తన కొడుకు కష్టపడుతున్నట్లు మహేశ్ పేర్కొన్నాడు.




## టెస్టుల్లో జైస్వాల్ 40 సెంచరీలు చేస్తాడు

- అతడిని ఆపకుంటే ఆసీస్‌కు తిప్పలే : మ్యాక్స్‌వెల్



సిడ్నీ: భారత ఓపెనర్ యశస్వీ జైస్వాల్ టెస్టులలో సుమారు 40 శతకాలు చేస్తాడని ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అభిప్రాయపడ్డాడు. 'ది గ్రేడ్ క్రికెటర్' అనే పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మ్యాక్సీ మాట్లాడుతూ.. 'టెస్టులలో జైస్వాల్ 40 కంటే ఎక్కువ సెంచరీలు చేస్తాడు. అంతేగాక అతడు తన పేరు మీద కొన్ని ప్రత్యేకమైన రికార్డులను సృష్టించుకుంటాడు. ఎలాంటి పరిస్థితులనైనా తనకు అనుకూలంగా మలుచుకునే సామర్థ్యం అతడికుంది. అతడి ఫుట్‌వర్క్ అద్భుతం. అదీగాక అతడి బ్యాటింగ్‌లో లోపాలు వెతకడానికి పెద్దగా తప్పులు కనిపించడం లేదు. స్పిన్‌ను, పేస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాడు. బంతిని బాగా డ్రైవ్ చేస్తున్నాడు. రాబోయే టెస్టులలో అతడిని ఆపకుంటే ఆస్ట్రేలియాకు మరిన్ని తిప్పలు తప్పవు' అంటూ వ్యాఖ్యానించాడు.

## ఉర్విల్ మెరుపుల్

**28 బంతుల్లోనే సెంచరీ • టీ20లలో సరికొత్త రికార్డు**



ఇండోర్: గుజరాత్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ విధ్వంసకర మెరుపులకు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో పాత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. త్రిపురతో ఇండోర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అతడు.. 28 బంతుల్లోనే శతకాన్ని పూర్తిచేశాడు. ఈ క్రమంలో అతడు టీ20లలో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. అంతకుముందు ఈ రికార్డు రిషభ్ పంత్ (హిమాచల్ ప్రదేశ్‌పై 32 బంతుల్లో) పేరిట ఉంది. మొత్తంగా పొట్టి ఫార్మాట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ.. ఈస్తోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ (27 బంతుల్లో) ఖాతాలో ఉండగా ఉర్విల్ రెండో స్థానాన నిలిచాడు. ఇక త్రిపురతో మ్యాచ్‌లో ఉర్విల్ 35 బంతుల్లోనే 7 బౌండరీలు, 12 భారీ సిక్సర్లతో 113 పరుగులు చేసి అజేయంగా నిలవడంతో 156 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 10.2 ఓవర్లలోనే ఛేదించింది. కాగా మూడు రోజుల క్రితం ముగిసిన ఐపీఎల్ వేలంలో ఉర్విల్ అన్‌సోల్డ్‌గా మిగలడం గమనార్హం.

## వర్షిత్‌కు రజతం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాజ్‌కోట్ (గుజరాత్) వేదికగా జరుగుతున్న 68వ ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్ల పతకహవా కొనసాగుతున్నది. బుధవారం జరిగిన బాలుర అండర్-17 విభాగంలో వర్షిత్ 4:47:78సెకన్ల టైమింగ్‌తో రజత పతకంతో మెరిశాడు. మరోవైపు బాలికల అండర్-17 కేటగిరీ 50మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో నిత్యకు కాంస్యం దక్కింది.

## రెండో రౌండ్‌కు సింధు, లక్ష్యసేన్



లక్నో: స్వదేశంలో జరుగుతున్న సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ రెండో రౌండ్‌కు ప్రవేశించారు. రెండేండ్ల తర్వాత ఈ టోర్నీ ఆడుతున్న సింధు.. బుధవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్‌లో 21-17, 21-15తో భారత్‌కే చెందిన అన్మోల్ ఖర్బ్‌ను ఓడించింది. రెండో రౌండ్‌లో సింధు.. ఇరా శర్మతో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-12, 21-12తో షోలేహ్ ఐదిల్ (మలేషియా)పై అలవోక విజయం సాధించాడు. లక్ష్యతో పాటు కిరణ్ జార్జి.. 21-12, 23-21తో అలప్ మిశ్రా (భారత్)ను ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక, అనుపమ , ఇషారాణి, దేవిక, ఉన్నతి, తస్నిమ్ మిర్, శ్రీయాన్షి ముందంజ వేశారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.